క్లుప్తంగా

ఆధార్ శిబిరాల పరిశీలన



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దికెర: ఆధార్ సవరణల శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మద్దికెర సచివాలయం-1, పెరవలి గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌లో మార్పు, చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఆధార్‌కు మొబైల్ అనుసంధానం చేయడంతో పాటు బయోమెట్రిక్ అప్‌డేట్, ఫొటో, ఐరిష్, వేలిముద్రలు, పేరు, పుట్టిన తేదీల్లో , చిరునామాలో మార్పులు చేస్తారని చెప్పారు. ఎంఈఓ గోపాల్ ఉన్నారు.

టీచర్‌ను నియమించండి

తుగ్గలి : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో టీచర్‌ను నియమించాలని జొన్నగిరి ఎస్సీ కాలనీవాసులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఎంఈవో-2 రామవెంకటేశ్వర్లును వినతి పత్రం అందజేశారు. గ్రామ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 84 విద్యార్థులు ఉండగా ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారన్నారు. సింగిల్ టీచర్‌తో బోధన కుంటుపడుతోందని వాపోయారు. మరో టీచర్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. టీచర్‌ను సర్దుబాటు చేస్తామని ఎంఈవో వారికి హామీ ఇచ్చారు.

డెంగీ, డయేరియాపై అవగాహన

పత్తికొండరూరల్: డెంగీ, డయేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టరాదు, దోమలు పుట్టరాదు, దోమతెరలు వాడండి అంటూ నినాదాలు చేస్తూ నివారణ జాగ్రత్తలను వివరించారు. ఎంపీడీఓ రామారావు, వైద్యులు సుజాత, కార్తీక్ , మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వసుంధర, ఈఓఆర్‌డీ మునిస్వామి, పాల్గొన్నారు.

గ్రామ సేవకుడు మృతి

కృష్ణగిరి: మండలంలోని తొగర్చేడు గ్రామానికి చెందిన గ్రామ సేవకుడు తలారి వెంకటరాముడు (62) బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కొలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.10వేలు అందజేశారు. తోటి గ్రామ సేవకులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామంలోని పిరమిడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు బుధవారం కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ముగ్గురు బాలికలు, ఆరుగురు బాలురు ఎంపికయ్యారని కరెస్పాండెంట్ పాండు తెలిపారు. అర్చన, సానియా, వీరేష్, తోఫీ ఉమర్ తదితరులను అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

దేవనకొండ: స్థానిక ఎరువులు,విత్తనాల దుకాణాలను ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా సత్యసాయి ఏజెన్సీస్ ఎరువుల షాపులో రికార్డులు పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డుల కోసం వీఆర్వో వద్ద గానీ, రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. ఏఓ సురేష్‌బాబు, ఏఈఓలు జయరామ్, రంగన్న ఉన్నారు.

కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారి-44పై చెరుకులపాడు క్రాస్ వద్ద ఈ నెల 18న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురువ మహేష్‌పై దాడి చేసిన వారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. దాడిలో మహేష్‌కు మూగ గాయాలు కావడంతో కోర్టు ఆదేశాలతో దాడి చేసిన కృష్ణగిరి మండలం, పుట్లూరు గ్రామానికి చెందిన ఉప్పరి కృష్ణ, ఉప్పరి శ్రీరాములు, ఉప్పరి వెంకటేశ్వర్లు, ఉప్పరి గిడ్డయ్య, ఉప్పరి చంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మద్దికెర : పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే విషకీటకాలు, పాములు వంటివి లోపలికి రావని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. కస్తూర్బా విద్యాలయంలో పాము కలకలం అనే వార్తకు స్పందించిన తహసీల్దార్ బుధవారం స్థానిక విద్యాలయాన్ని, పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది వారానికి ఒకసారైనా బ్లీచింగ్ పౌడర్ వేసేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి విజయ్‌ను ఆదేశించారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి ఉన్నారు.



మొదటి విడతలో రూపుదిద్దుకున్న తుంబళబీడు గ్రామ ఎంపీపీ పాఠశాల



రెండో విడత పనులు నిలిచిపోయిన హొళగుందలోని జెడ్పీ ఉన్నత పాఠశాల



ఆస్పరిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం



హాలహర్వి మండలం నిట్రవట్టి ఎంపీపీ పాఠశాల పనులు నిలిచిన దృశ్యం



ఎం.కొట్టాల గ్రామ ఎంపీయూఎస్ పాఠశాలలో గదుల కొరత కారణంగా హెచ్ఎం గదిలో కూర్చున్న విద్యార్థులు (ఫైల్)

నాడు పరుగులు..నేడు తడ'బడి'!

- నాడు-నేడు పనులపై నీలి నీడలు
- నత్తనడకన రెండో విడత పాఠశాలల ఆధునీకరణ పనులు
- మొదటి విడతలో 215 పాఠశాలల్లో రూ.53.70 కోట్లతో పనులు పూర్తి
- రెండో విడతలో 286 పాఠశాలలకు రూ.124.57 కోట్లు కేటాయింపు
- గదులు,మౌలిక వసతుల కొరతతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద బడుల ఆధునీకరణ పనులు చేపట్టింది. మొదటి విడతలో చేసిన పనులతో విద్యార్థులు, తల్లిండ్రులు, ఉపాధ్యాయులు తమ స్కూళ్లను చూసి ఆశ్చర్యపోయారు. ఇక రెండో విడత కింద పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి, పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. ఎన్నికల ముందు వరకు పనులు వేగంగా సాగినా, ఎన్నికల కోడ్, ఆ తరువాత పనులు నిలిచిపోయాయి. కారణాలు అడిగితే.. సిమెంట్ కొరత, నిధులు విడుదల కాకపోవడమేనని కాంట్రాక్టర్లు, అధికారులు చెబుతున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.





రాతనలో ఆగిపోయిన జెడ్పీహెచ్ఎస్ తరగతి గదుల నిర్మాణాలు,పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు

ఆలూరు రూరల్/తుగ్గలి: ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో నాడు-నేడు రెండో విడత పాఠశాలల ఆధునీకరణ పనులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునీకరణ పనులు నత్తనడక సాగుతుండగా మరికొన్ని పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. పాఠశాలలు ప్రారంభమై నెలన్నర కావస్తున్నా పనుల జాప్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పేదల పిల్లలు సైతం కార్పొరేట్ తరహాలో చదువుకోవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అదనపు గదుల నిర్మాణం చేపట్టింది. మొదటి విడత కింద ఆలూరు నియోజకవర్గంలో 144 పాఠశాలలను ఎంపిక చేసిన రూ. 31.14 కోట్లతో ఆధునీకరించింది. 2023లో రెండో విడత కింద ఆరు మండలాల్లో 166 పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.88.24 కోట్లు కేటాయించింది. పత్తికొండ నియోజకవర్గంలో కృష్ణగిరి, తుగ్గలి, పత్తికొండ, మద్దికెర మండలాల్లో మొత్తం 189 పాఠశాలలు ఉండగా.. తొలి విడతలో 71 పాఠశాలలకు రూ.22.56 కోట్లు మంజూరు చేయగా, రెండో విడతలో 120 పాఠశాలలను ఎంపిక చేసి రూ.36.33 కోట్లు మంజూరు చేసింది. కాగా మొత్తం 118 పాఠశాలలు, మద్దికెర మండలంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 120గా పేర్కొన్నారు.

నిలిచిన పనులు..

తొలి విడతలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దింది. రెండో విడతలో ఎంపిక చేసిన పాఠశాలలో మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టింది. కుటమి ప్రభుత్వం ఏర్పడటంతో

మండలం	ఫేస్-1 పాఠశాలలు	మంజూరైన నిధులు	ఫేస్-2 పాఠశాలలు	మంజూరైన నిధులు
తుగ్గలి	20	రూ.4.95 కోట్లు	38	రూ.14.52 కోట్లు
కృష్ణగిరి	22	రూ.7.29కోట్లు	38	రూ.15.79 కోట్లు
మద్దికెర	11	రూ.1.32 కోట్లు	15	రూ.1.53 కోట్లు
పత్తికొండ	18	రూ.9కోట్లు	27	రూ.4.49 కోట్లు
మొత్తం	71	రూ.22.56 కోట్లు	118	రూ.36.33 కోట్లు

అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. సిమెంటు, అవసరమైన నిధులు రాక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఎస్ఎస్ఏ అధికారులు మాత్రం సిమెంటు లేక నిర్మాణాలు నిలిచిపోయాయని, త్వరలో ప్రారంభిస్తామని చెబుతున్నారు. ఓవైపు పనులు నిలిచిపోవడం, మరో వైపు తగినన్ని గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కాగా ఆగస్టు నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించగా పనులు నిలిచిపోవడంతో ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

కార్పొరేట్‌కు ధీటుగా సౌకర్యాలు..

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు-నేడు పథకంతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దింది. నాడు-నేడు పథకంలో భాగంగా మొదటి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకొని తొమ్మిది రకాల వసతులు కల్పించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మారిన బడులను చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఫలితంగా చెట్టుకింద కూర్చుని చదవడం, ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడం, చేతిపంపుల వద్ద భోజనం ప్లేట్లు శుభ్రం చేసుకోవడం..ఇంటి నీరు తాగునీరు తెచ్చుకునే పరిస్థితులకు చరమగీతం పాడారు. తల్లిదండ్రులకు పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్నామనే భావనను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కల్పించారు.



జి.మల్లాపురం ప్రాథమిక పాఠశాలలో నిలిచిన నిర్మాణాలు

గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రస్తుతం పల్లెల్లో ప్రభుత్వ బడులు కార్పొరేట్‌కు ధీటుగా సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి.

నత్తనడకన రెండో విడత పనులు..

రెండో విడత నాడు-నేడు కింద రెండు నియోజకవర్గాల్లో 286 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ఎంపీపీ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఆలూరు నియోజకవర్గంలో రెండో విడతలో 24 స్కూళ్లలో రూ.13.59 కోట్లతో పనులు జరుగుతున్నాయి. మరి కొన్ని పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి.

నాడు-నేడు కింద మొదటి, రెండు విడతల్లో మండలాల వారీగా ఎంపికైన పాఠశాలలు, నిధుల మంజూరు

మొదటి విడత..

మండలం	పాఠశాలలు	కేటాయించిన నిధులు
ఆలూరు	24	రూ.7.27 కోట్లు
ఆస్పరి	21	రూ.5.26 కోట్లు
చిప్పగిరి	11	రూ.2.82 కోట్లు
దేవనకొండ	22	రూ.5.74 కోట్లు
హాలహర్వి	16	రూ.4.42 కోట్లు
హొళగుంద	20	రూ.5.63 కోట్లు

రెండో విడత..

మండలం	పాఠశాలలు	కేటాయించిన నిధులు
ఆలూరు	24	రూ.13.59 కోట్లు
ఆస్పరి	34	రూ.18.18 కోట్లు
చిప్పగిరి	15	రూ.4.19 కోట్లు
దేవనకొండ	44	రూ.22.44 కోట్లు
హాలహర్వి	23	రూ.11.92 కోట్లు
హొళగుంద	26	రూ.17.72 కోట్లు

నిధులు విడుదలైతే పనులు త్వరగా పూర్తిచేస్తాం



రెండో విడత నాడు-నేడుకు ఎంపికైన చాలా పాఠశాలల్లో సిమెంట్ సరఫరా కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలల్లో మాత్రమే పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా ఎన్నికల కోడ్, వివిధ కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. నిధులు కూడా అంతంత మాత్రంగా విడుదలయ్యాయి. పూర్తి స్థాయి నిధులు విడుదలైతే పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం.

– వెంకటరమణా రెడ్డి, డిప్యూటీ ఈఈ,ఆదోని

పెద్దహ్యాటకు బస్సు నడపండి

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులు, గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామం నుంచి హొళగుందలోని ఉన్నత పాఠశాల, కాలేజీలకు చాలా మంది విద్యార్థులు వెళ్తుంటారని వారికి బస్సు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలినడకన రోజూ 16 కి.మీ మేర నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కురువ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్యాట మల్లయ్య, మండలధ్యక్షుడు పంపాపతి, మలామహానాడు జిల్లా, సీఐటియూ మండల కార్యదర్శులు వీరభద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

మద్దికెర : ప్రభుత్వ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ గోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయం, ఆదర్శ పాఠశాలల్లో ఫస్టియర్ ఇంటర్ 160, సెకండియర్ ఇంటర్ 68 మందికి మొత్తం 228 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సవిత, అధ్యాపకులు ఉన్నారు.

హొళగుంద: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రవీణ బుధవారం కళాశాలలో 268 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు తదితర స్టడీ కిట్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శశికుమార్, మల్లికార్జున, రమేశ్, నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో మూగ జీవాలకు షెడ్లు

తుగ్గలి: ఉపాధి హామీ పథకం నిధులతో మూగ జీవాలకు షెడ్ల నిర్మాణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తుగ్గలి పశువైద్యాధికారిణి ప్రణీత బుధవారం తెలిపారు. పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, జీవాలు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి 70 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఇందుకు దారిద్ర్యరేఖ దిగువ ఉన్న వారు, మహిళా యజమాని,అంగవైకల్య యజమాని కుటుంబాలు, భూ సంస్కరణ, పీఎం ఏవైజీ లబ్ధిదారులు, సొంత భూమి,ఇంటి స్థలం ,ఉపాధి జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, సంచార జాతుల వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి

హొళగుంద: విద్యార్థులు గుర్రం జాషువను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఎంఈఓ-1 సత్యనారాయణ, ఎంఈఓ-2 జగన్నాథం, అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టరు రంగస్వామి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిద్ధార్థ యూపీ పాఠశాలలో కరెస్పాండెంట్ చిదానంద ఆధ్వర్యంలో గుర్రం జాషువ 53వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నీటి సమస్య పరిష్కారం

చిప్పగిరి: మండంలోని నంచర్ల గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. నీటి సమస్య పరిష్కరించండి సారూ అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. గ్రామంలో పైప్‌లైన్‌కు ఉన్న వాల్వ్ మరమ్మతులకు గురి కావడంతో వారం రోజులుగా పలు కాలనీలకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కథనంపై స్పందించిన సర్పంచ్ భీమ, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర బుధవారం కొత్త వాల్వ్ అమర్చి నీటి సమస్యను పరిష్కరించారు. అధికారుల చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్



కొత్త వాల్వ్ ఏర్పాటు చేసిన దృశ్యం

పశువైద్యం అందడం లేదు

చిప్పగిరి: మూగ జీవులకు సరైన వైద్యం అందడం లేదని పశుపోషకులు వాపోతున్నారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని రామదుర్గం,ఏరూరు, నేమకల్లు గ్రామాల్లో పశువైద్యశాలలున్నాయి. మిగలిన 9 పంచాయతీల్లో ప్రతి గ్రామానికి ఆనిమల్ హస్బెండరీ అసిస్టెంట్‌లు ఉన్నారు. ఇంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నా తమ జీవాలు, పశువులకు సేవలందడం లేదని ఆరోపిస్తున్నారు. బుధవారం నంచర్ల గ్రామ పోషకులు ఈశ్వరప్ప,మల్లికార్జున,యల్లప్ప,పెద్ద అంజినయ్య తదితరులు మాట్లాడుతూ.. తమకు రెండు వందల చొప్పున గొర్రెలున్నాయని, వాటికి వ్యాధులు ప్రబలడంతో టీకాలు వేయలేదని, దీంతో సొంతంగా ఖర్చు చేసి వేయించుకున్నామని, ఇందుకు అప్పులు చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

పత్తికొండ రూరల్ : పట్టణంలోని బుడగజంగాల కాలనీలోని గద్దెరాళ్ల మారెమ్మ ఆలయానికి ఉన్న ప్రధాన గేటు విరిగి పడి విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు విశ్రాంతి సమయంలో గేటు వద్ద ఆడుకుంటుండగా గేటు కమ్మీ నుంచి తప్పిపోయి పక్కకు ఒరిగి కిందపడింది. దీంతో విద్యార్థులు చంద్రకళ, సుధీర్, హేమకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన కాలనీవాసులు విద్యార్థులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇనుప గేటు మీద పడి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేది.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వర్షపునీరు నిలిచిపోవడాన్ని చూసి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బస్టాండులోని మెయిన్ రోడ్డు, పుల్లాపురం రస్తా, వడ్డేగేరి, తెల్లవంక, మసీదు ముందు, ఎస్సీ కొత్త కాలనీ, ఎస్సీ బాలికల వసతిగృహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేయించడం, పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్కుమార్, ఎంపీడీఓ ఇద్రూస్‌బాషా, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రాము, సునీత, వీఆర్వో మునీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపాల్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం

మద్దికెర: విద్యార్థుల అభ్యసనం, అభివృద్ధే లక్ష్యాలుగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ సవిత అన్నారు. బుధవారం శిక్షన స్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో వస్తు ప్రదర్శన, చదరంగం, భాషా గుణింతం వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పత్తికొండ రూరల్ : శిక్ష సప్తాహ్‌లో భాగంగా బుధవారం పత్తికొండలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో విద్యార్థులకు కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడలు నిర్వహించారు. ముందుగా హెచ్ఎం వి. మాలతి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాష, రాజేష్, దేవిబాయ్, రజియాబాను పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడికి నివాళి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని బుధవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కవితాబాయ్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహ నాయుడు, ప్రైవేట్ లెక్చరర్ దివాన్‌వలి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయోద్యమకారుడిగా, ప్రకృతి వైద్యం, ఆయుర్వేదంలో సిద్ధహస్తుడిగా, పత్రికా సంపాదకుడిగా అయ్యంకి వెంకటరమణయ్య కృషి చేశారని వారు కొనియాడారు.

మేం చెప్పిన డీలర్లకే సరుకులివ్వాలి!

ఆలూరు: తాము చెప్పిన డీలర్లకు మాత్రమే స్టాక్ పాయింట్ నుంచి రేషన్ సరుకులు ఇవ్వాలని కూటమి నాయకులు సివిల్ సప్లయీస్ అధికారులకు కూటమి నాయకులు హుకూం జారీ చేసినట్లు తెలిసింది. ఆలూరు స్టాక్ పాయింట్ నుంచి ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద మండలాలోని 114 గ్రామాల రేషన్ షాపుల డీలర్లుకు రేషన్ సరుకులను పంపిణీ చేస్తారు. అయితే నియోజకవర్గంలోని కూటమి నేతలు.. ప్రస్తుతం అధికారం తమది. మా కార్యకర్తలకు వివిధ గ్రామాల్లో రేషన్‌షాపుల డీలర్లను పోస్టులను కట్టబెట్టాలి. కావున ఇన్‌చార్జ్ డీలర్లకు ఎటువంటి పరిస్థితుల్లో సరుకులు ఇవ్వరాదని ఆర్ఐ, సివిల్ సప్లయీస్ గోదాము ఇన్‌చార్జ్‌లకు సూచనలు చేశారు. దీంతో స్థానిక అధికారులు విషయాన్ని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖరయ్య దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అలాగే ఇన్‌చార్జ్ డీలర్లు విషయాన్ని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షికి తెలియజేశారు. ఆయన ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత అధికారులతో మాట్లాడి ఈనెల సరుకులు పంపిణీ చేయాలని, లేకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పగా వారు ఇందుకు ఒప్పుకున్నట్లు తెలిసింది.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

- డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు

ఆలూరు రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని పత్తికొండ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన వల్ల అనారోగ్యాలకు గురవుతారన్నారు. దీనికి తోడు పారిశుద్ధ్యం లోపిస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు.

మూడు రోజులకోసారి మంచినీటి సరఫరా..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో మూడు రోజులకో సారి తాగునీరు సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య తెలిపారు. ఇప్పటి వరకు 15 రోజుల నుంచి 20 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా జరిగేదని, ఇక నుంచి సమృద్ధిగా సరఫరా చేస్తామని చెప్పారు. సంపుల్లో, సింటెక్సులు,డ్రమ్ముల్లో నీరు నిల్వ చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. ఇలా చేయడం వల్ల నీటిలో పురుగులు పడి నీరు వృథా అవుతుందన్నారు. జేఈ మోహన్, పంచాయతీ సిబ్బంది రాంబాబు, వినోద్ ఉన్నారు.



పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు

గడ్డివాముల దగ్ధం

మద్దికెర : స్థానిక పెట్రోల్ బంకు వద్దనున్న రా మస్వామి, లక్ష్మన్న అనే రైతులకు చెందిన రెండు గడ్డివాములు బుధవారం తెల్లవారు జాము న దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రైతులకు దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. గుంతల్లుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

గుర్తింపు కార్డులతో రైతులకు మేలు

పత్తికొండ రూరల్ : పొలాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న రైతులు కౌలు కార్డు తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందుతారని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు అన్నారు. బుధవారం మండలంలోని పుచ్చకాయలమాడలో గ్రామసభ నిర్వహించారు. పంట నష్టం వాటిల్లితే పరిహారం అందుతుందన్నారు. అనంతరం 23 మంది రైతులకు కౌలుగుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.